క్లుప్తంగా

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వండి



పౌష్టికాహార మాసోత్సవాల్లో మహిళలు

పాకాల: పరిసరాల శుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రతకు అందరూ ప్రాధాన్యత ఇవ్వాలని ఐసీడీఎస్ దామలచెరువు సెక్టార్ సూపర్‌వైజర్ కృష్ణవేణి కోరారు. శుక్రవారం కుక్కలపల్లె అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకురాలు పోతక్క ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ, గర్భిణులు ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనివ్వాలంటే క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అలాగే ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉపాధ్యాయని ఉష, కార్యకర్తలు సరళ, అన్నపూర్ణ, ఆశావర్కర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

అలిపిరి దారిలో దివ్యదర్శనం

- త్వరలోనే టోకెన్ల జారీకి చర్యలు
- టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుమల : తిరుమలకు కాలినడకన వచ్చే భక్తులకు త్వరలోనే అలిపిరి పాదాల మండపం వద్ద దివ్య దర్శనం టోకెన్లు జారీని పునఃప్రారంభించనున్నట్లు టీటీడీ ఈఓ జె. శ్యామలరావు చెప్పారు. శుక్రవారం తిరుమల అన్నమయ్య భవనంలో నిర్వహించిన డయల్ యువర్ ఈఓలో ఆయన పలువురు భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

రాజేష్, కర్నూలు : 65 ఏళ్లు నిండిన వృద్ధులు క్యూలో నడవలేరు. వారిని ప్రత్యేకంగా శ్రీవారి దర్శనానికి అనుమతించండి.

ఈఓ : వృద్ధులను బయోమెట్రిక్ ద్వారా దర్శనానికి అనుమతిస్తున్నాం.

రమేష్‌బాబు, విశాఖపట్నం : ఆన్‌లైన్‌లో గదులు పొందిన వారికి శ్రీవారి మెట్టు దగ్గర స్కానింగ్ ఏర్పాటు చేయండి.

ఈఓ : సీఆర్‌ఓ వరకు వెళ్లవలసిన అవసరం లేకుండా, స్కానింగ్ కౌంటర్ ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తాం.

ప్రవీణ్, కుప్పం : ఆన్‌లైన్‌లో అంగప్రదక్షిణ టోకెన్లు పొందిన భక్తులు చాలామంది రావడం లేదు. అందువల్ల ఆఫ్‌లైన్‌లో కూడా అంగప్రదక్షిణ టోకెన్లు ఇస్తే మంచిది.



డయల్ యువర్ ఈఓలో టీటీడీ ఈఓ శ్యామలరావు

ఈఓ : అంగప్రదక్షిణం టోకెన్లను ఆఫ్‌లైన్‌లో ఇవ్వలేం.

రాఘవేంద్ర వేలూరు : తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం వసతి సముదాయాల్లో ఆఫ్‌లైన్‌లో కూడా గదులు కేటాయించండి.

ఈఓ : తిరుపతిలోని విష్ణునివాసంలో 50 శాతం గదులు ఆన్‌లైన్‌లో, 50 శాతం ఆఫ్‌లైన్‌లో కేటాయిస్తున్నాం.

రమణమ్మ, విశాఖపట్నం : శ్రీవారి కల్యాణోత్సవానికి పెళ్లి అయిన మా పిల్లలను అనుమతిస్తారా.

ఈఓ : శ్రీవారి కల్యాణోత్సవంలో దంపతులు, పెళ్లి కాని పిల్లలను రూ.300 టికెట్ ద్వారా అనుమతిస్తున్నాం.

గైడెన్స్ బుక్‌లెట్ విడుదల

తిరుపతి సిటీ : యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సంబంధించిన గైడెన్స్ బుక్‌లెట్‌ను విడుదల చేసినట్లు గిండి ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ సురేష్ కుమార్ గిండి తెలిపారు. శుక్రవారం అకాడమీలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.కోదండరామిరెడ్డి, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల సైకాలజీ హెడ్ అజ్మల్‌బాషా, కెమిస్ట్రీ హెడ్ పరమేశ్వర, రిటైర్డ్ ప్రిన్సిపల్ ఎల్ఆర్ మోహన్‌కుమార్, డాక్టర్ ఏ.నాధముని చేతులమీదుగా బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ సివిల్స్‌కు హాజరయ్యే విద్యార్థులకు ఈ బుక్‌లెట్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు కావలసిన అన్ని టిప్స్ ఇందులో ఉంటాయని వెల్లడించారు.



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు



నివాళులర్పిస్తున్న భూమన కరుణాకరరెడ్డి

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి

తిరుపతి మంగళం : తిరుపతి ఎమ్మార్‌పల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మునిసుబ్రమణ్యం అనారోగ్య కారణంగా శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి వెంటనే మునిసుబ్రమణ్యం నివాసానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు.

వేలం..రూ.4.26 లక్షల ఆదాయం

పాకాల: మండలంలోని దామలచెరువులో పంచాయతీలో నిర్వహించి వేలంలో రూ.4.26 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓపీఆర్డీ మాలతి తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలోని 7 నెలల కాలానికి మాత్రమే ఈ వేలం నిర్వహించినట్లు తెలిపారు. వారపుసంత రూ.3,06,000, ప్రైవేట్ బస్టాండ్ రూ.1,06,000, పంచాయతీ రూములకు రూ.10,300, కొబ్బరి చెట్లకు రూ.4,400లకు వేలం పాడారని తెలియజేశారు. సర్పంచ్ సునీత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న ఈఓపీఆర్డీ మాలతి

వృద్ధాశ్రమంలో అన్నదానం

పాకాల: మండలంలో కొత్తపల్లెలోని లక్ష్మీబాయి వృద్ధాశ్రమంలో శుక్రవారం వృద్ధులకు అన్నదానం చేశారు. టీటీడీ విశ్రాంత శానిటరీ వర్కర్ బోడిగుట్టపల్లె రాజమ్మ 4వ వర్ధంతి సందర్భంగా ఆమె మేనల్లుడు గొడుగుచింత నరసింహులు, శోభారాణి దంపతులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

బదిలీలు.. బేరసారాలు!

''పోస్టు ఏదైనా.. ఎక్కడైనా సరే ముడుపులు చెల్లించిన వారికే అవకాశం దక్కుతుంది.. అడిగినంత ఇవ్వకుంటే పోస్టింగ్ మాత్రం రాదు. ఉద్యోగుల బదిలీల్లో మా కేడర్ మాటలు పట్టించుకోవడం లేదు. వారి సిఫార్సులను లెక్క చేయడం లేదు. నేను పంపించే వ్యక్తి మీకు సాయం చేస్తాడు, ఏ పనులు కావాలన్నా నాకు చెప్పండి, నేను చేసిపెడతా'' అంటూ టీడీపీ ముఖ్యనేతే నేరుగా బేరసారాలకు దిగుతుండడంతో పార్టీ నేతలు ఖంగుతింటున్నారు. చంద్రగిరి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగుల బదిలీల్లో తన అనుచరులనే మధ్యవర్తులుగా పెట్టుకుని నగదు వసూళ్లకు పాల్పడుతుండడంపై మండిపడుతున్నారు. ఇంతకీ ఏంటా కథ ? అనుకుంటున్నారా..? అయితే ఈ కథనం చదవాల్సిందే.

- పోస్టు ఏదైనా ముడుపులు ఇచ్చిన వారికే అవకాశం
- రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు
- మధ్యవర్తులుగా పులివర్తి నాని అనుచరులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చంద్రగిరి నియోజకవర్గంలో ఉద్యోగుల బదిలీలు అడ్డగోలుగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు తమకు నచ్చిన ఉద్యోగులను తెచ్చుకుంటే ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని ఆశ పడ్డారు. ఎన్నికల ముందు మనం అధికారంలోకి వస్తే మీకు ఏం కావాలన్నా చేస్తానని మాట ఇచ్చిన ముఖ్య నేత.. ఇప్పుడు మాటమార్చడంతో విస్తుబోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ప్రక్రియలో ఆయన అసలు రంగు బయటపెట్టడంతో నివ్వెరబోతున్నారు. ఇప్పటికే మండల స్థాయి అధికారుల విషయంలో తానే స్వయంగా జోక్యం చేసుకుని పోస్టింగ్‌లు ఇప్పించారు. ఇప్పుడు గ్రామ స్థాయి ఉద్యోగుల బదిలీలల్లో కూడా తన అనుచరులను మధ్యవర్తులుగా చేసుకుని బేరసారాలు సాగిస్తుండడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేసేందుకు శ్రేణులు సమాయత్తమవుతున్నట్లు తెలిసింది.

గతంలో ఇలా లేదు..

చంద్రగిరి ఎమ్మెల్యేలుగా గతంలో పనిచేసిన గల్లా అరుణకుమారి, రామ్మూర్తి నాయుడు, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఏకపక్షంగా ఎన్నడూ బదిలీ ప్రక్రియకు శ్రీకారం చుట్టలేదు. పార్టీ నేతలతో సంప్రదించిన తర్వాతే పోస్టింగ్‌లకు సహకరించారు.పార్టీ నేతలు తమకు కావాల్సిన అధికారులను తమ గ్రామాలు లేదా మండలాలకు తెచ్చుకునేందుకు ఒక్క మాట చెబితే చాలు ఆ ఎమ్మెల్యేలు ఏ మాత్రం ఆలోచించకుండా పోస్టింగ్‌లు ఇప్పించే వారు. అయితే ప్రస్తుతం టీడీపీ ముఖ్యనేత మాత్రం ఉద్యోగుల బదిలీల విషయంలో ఏకపక్షంగా వ్యవహరిస్తుండడం ఆ పార్టీ క్యాడర్‌కు మింగుడు పడడం లేదు.

కష్టపడి గెలిపించినా..

పులివర్తి నానిని గెలిపించాలని కష్టపడ్డాం.. ఇంటింటికీ తిరిగాం.. ఓటర్లను ఒకటికి పదిసార్లు బతిమాలుకున్నాం.. ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రాధేయపడ్డాం.. ఎంతో కష్టపడి గెలిపించాం.. ఆయన గెలిస్తే మాకు మంచి జరుగుతుందని ఆశ పడ్డాం. టీడీపీ విజయం కోసం కృషి చేశామనే కనికరం లేకుండా మా నాయకుడు వ్యవహరిస్తున్నారని పార్టీ కేడర్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. గ్రామంలో తమకు నచ్చిన అధికారిని తెచ్చుకుందామన్న ఆశ కూడా లేకుండా చేశారని వాపోతోంది.

గప్ చుప్‌గా వెసులుబాటు

ఉద్యోగుల బదిలీల్లో ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను టీడీపీ ముఖ్య నేత పూర్తిగా పక్కనబెట్టారు. తనకు పైసలు ఇస్తే చాలు ఎక్కడివారు అక్కడే గప్‌చుప్ గా పనిచేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. అలాగే పంచాయతీ కార్యదర్శుల నియామకాల్లో సైతం నిబంధనలను తుంగలో తొక్కేశారు. తనకు ముడుపు చెల్లించిన వారు ఎక్కడ కావాలంటే అక్కడ పోస్టింగ్ ఇప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే అడిగిన సొమ్ము చెల్లించిన వారికి మళ్లీ అదే మండలంలో స్థానం కల్పిస్తున్నారు.

విశ్వసనీయ సమాచారం మేరకు బదిలీల వివరాలు ఇలా..

పంచాయతీ కార్యదర్శి పేరు	ప్రస్తుత మండలం	బదిలీ కానున్న స్థానం
శంకరయ్య	బంగారుపాళెం	అవిలాల, తిరుపతి రూరల్
స్వర్ణమంజరి	పార్లపల్లె, బీఎన్ కండ్రిగ	పద్మావతీపురం
రెడ్డిజ్యోతీశ్వర్‌ప్రసాద్	జక్కదోన, వెదురుకుప్పం	పేరూరు
మురళి	శెట్టిపల్లి	న్యూ మంగళం, తిరుపతి రూరల్
వెంకటేశ్వర్లు	బీరకుప్పం, నాగలాపురం	తుమ్మలగుంట, తిరుపతి రూరల్
ఆర్.విజయ నిర్మల	డిప్యుటేషన్, లింగేశ్వరనగర్	గాంధీపురం, తిరుపతి రూరల్
ఆర్.మాధవి	కందాడు, ఏర్పేడు	శ్రీనివాసపురం, తిరుపతి రూరల్
శ్రీలేఖ	వడమాలపేట	సాయినగర్, తిరుపతి రూరల్
పి.కేశవులు	తిరుమలయ్యపల్లె, వెదురుకుప్పం	బ్రాహ్మణపట్టు, తిరుపతి రూరల్
పి.సుజాత	ఆర్ మల్లవరం, రేణిగుంట	చెర్లోపల్లె, తిరుపతి రూరల్
ఎస్.నరసింహులు	నరసింగాపురం, చంద్రగిరి	దుర్గసముద్రం, తిరుపతి రూరల్
ఏ.గోపి	పత్తిపుత్తూరు, వడమాలపేట	పాడిపేట, తిరుపతి రూరల్
జోత్స్నాదేవి	ఎస్‌బీఆర్ పురం, వడమాలపేట	ముండ్లపూడి, తిరుపతి రూరల్
ఏ.మధుసూదన్	పెరుమాళ్లపల్లె, తిరుపతి రూరల్	
కె.రేవతి	పాడిపేట, తిరుపతి రూరల్	
యు. ఉషారాణి	పరమేశ్వరమంగళం	వేదాంతపురం, తిరుపతి రూరల్
జ్యోతి లత	పెడిపల్లి, తిరుపతి రూరల్	
జి.వెంకటశివ	ఆర్ అనంతపురం, బీఎన్ కండ్రిగ	గొల్లపల్లె, తిరుపతి రూరల్
షేక్ జిలానిభాష	మాంగుంట, ఎస్ఆర్ పురం	పాతకాల్వ, తిరుపతి రూరల్
కె.లక్ష్మీనరసింహ	వెదురుకూరు	చిగురువాడ, తిరుపతి రూరల్
బాలసుబ్రమణ్యం రెడ్డి	వెంకటాపురం, రేణిగుంట	మల్లంగుంట, తిరుపతి రూరల్
వై.నేతాజీ	పెద్దబైనపల్లె, పాకాల	రామానుజపల్లె, తిరుపతి రూరల్
బి.శివకుమార్	రాతిగుంటపల్లె, కలకడ	సి మల్లవరం, తిరుపతి రూరల్
ఝాన్సీ	శ్రీనివాసపురం	కుంట్రపాకం, తిరుపతి రూరల్
ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి	పాడిపేట, తిరుపతి రూరల్	తనపల్లె, తిరుపతి రూరల్
ఎస్.సుచిత్ర	కేసీ పేట, తిరుపతి రూరల్	లింగేశ్వరనగర్, తిరుపతి రూరల్
ఎస్.విజయలక్ష్మి	కొత్త వేపకుప్పం, ఆర్సీ పురం	కేసీ పేట, తిరుపతి రూరల్
ఏపీ లోకేష్ బాబు	కొల్లగుంట, కార్వేటినగరం	వెంకటపతి నగర్, తిరుపతి రూరల్
లావణ్య	మంగళం,తిరుపతిరూరల్	రిక్వెస్ట్ టు రిటర్న్

అవగాహనతోనే గర్భాశయ క్యాన్సర్ దూరం


తిరుపతి రూరల్: మహిళలు హెచ్‌పీవీ టీకాపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నుంచి రక్షణ పొందుతారని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హైమావతి అన్నారు. తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లెలో స్వయం సహాయక సంఘాల మహిళలకు శుక్రవారం గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, హెచ్‌టీవీ టీకాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి హైమావతి మాట్లాడారు. ప్రస్తుత కాలంలో మహిళల మరణాలకు అధిక కారణం అవుతున్న రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ ఎలా వస్తుంది? దాని నివారణకు దేశీయంగా రూపొందించిన హెచ్‌టీవీ టీకా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. తెలుగు రాష్ట్రాలలో ఏటా దాదాపు లక్షకుపైగా కొత్త క్యాన్సర్ కేసులు నమోదు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ టీకాను 9 నుంచి 18 ఏళ్ల బాలికలకు వేయించాలని కోరారు. అలాగే మహిళలు రుతుచక్ర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంచి ఆహార అలవాట్లు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కౌమార దశలో హార్మోన్ల ప్రభావం వల్ల వచ్చే సమస్యలు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం సిబ్బంది డాక్టర్ ఇంద్రాణి, ప్రీతి, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ హైమావతి

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

పాకాల: మండలంలోని చెన్నుగారిపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్ రావూరి మోహన్‌నాయుడు(62) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. గతంలో ఆయన దశాబ్ద కాలం పాటు సర్పంచ్‌గా పనిచేశారు. మండలంలోని పలువురు నాయకులు మోహన్‌నాయుడు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శుక్రవారం మణిపిరెడ్డిపల్లెలో అంత్యక్రియలు నిర్వహించారు.



మోహన్‌నాయుడు (ఫైల్)